క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ రూరల్: మండలంలోని పసరమడ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కనకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల వల్ల మండలంలోని పెద్ద రాంచర్ల, పసరమడ్ల, శామీర్‌పేట గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

దేవరుప్పుల: మండలంలోని సీత్యతండా గ్రామంలో ఇరువురిపై దాడిచేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ చేసినట్టు ఎస్సై ఊర సృజన్ కుమార్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. ఈ నెల 4వ తేదీన ధర్మాపురం రెవెన్యూ పరిధి సీత్యతండా గ్రామ పంచాయతీకి చెందిన గుగులోత్ మాన్ సింగ్‌తోపాటు అతని తల్లి తారమ్మను ఇదే తండాకు చెందిన గూగులోత్ ఉపేందర్, దేవేందర్ కర్రలతో కొట్టగా వారిపై కేసు నమోదైంది. ఈ విషయమై శనివారం వారిద్దరిని అరెస్టు చేసి జనగామ కోర్టుకు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ కేసు విషయమై ఎస్సై మాట్లాడుతూ మారిన కొత్త చట్టాలతో గతంలో మాదిరి కొట్టుకున్న విషయంలో కోర్టు వెసులుబాటు ఇవ్వకుండా ఇలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నందున మండల ప్రజలు క్షణికావేశంలో గొడవలు పడి ఇబ్బందులకు గురి కావొద్దని సూచించారు.

ఎస్టీ సెల్ మండల కమిటీ ఎన్నిక


రవి, అధ్యక్షుడు


సుభాష్, కోఆర్డినేటర్

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా కూరాకుల రవి ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నూనావత్ సుమన్ నాయక్ ఆదేశాల మేరకు ఈ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కోఆర్డినేటర్‌గా కూరాకుల సుభాష్, మండల ఉపాధ్యక్షులుగా మానుపాటి యాదగిరి, చవాన్ రమేశ్‌తో పాటు బొలుగుల లక్ష్మణ్, హరికృష్ణలను ఎన్నికయ్యారు.

సన్మానం



బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. శనివారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చలపతిరెడ్డి, యాదగిరి, అన్నపూర్ణ, లలిత, తిరుపతిరెడ్డి, సుప్రజలను ప్రధానోపాధ్యాయులు విజయ, ఉపాధ్యాయులు సన్మానించి వారి సేవలను కొనియాడారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం


నర్మెట: మండల కేంద్రంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు. శనివారం ఎస్సై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ గోపీ అనే వ్యక్తి మండలం నుంచి పలువురు వద్ద పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా 28 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినామన్నారు. ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.

'నిరుపేద ఆర్యవైశ్యులను ఆదుకోండి'



చిల్పూరు: నిరుపేద ఆర్యవైశ్యులను ఆర్థికంగా ఆదుకోవాలని మండలంలోని వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల నాయకుడు మంతెన లవన్ కుమార్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాతను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందజేసి సన్మానించారు.

నారు కట్టలతో సీఎం పేరు



నర్మెట: మండల కేంద్రంలో రైతు కందకట్ల బాలలక్ష్మి తన వ్యవసాయ పొలంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పేరును నారు కట్టలతో ఏర్పాటు చేసి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం హామీలను అమలు చేయడంతోపాటు రైతు రుణ మాఫీ చేసినందులకు సంతోషం వ్యక్తం చేస్తూ తోటి రైతులతో కలిసి నారు కట్టలతో రేవంత్ అన్నా ఆకృతిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ట్రాన్స్‌కో జర దేఖో!

- పాంనూర్‌లో హైటెన్షన్ విద్యుత్ స్తంభం కిందనే ట్రాన్స్‌ఫార్మర్
- ఒరిగిన స్తంభాలు.. వేలాడుతున్న కరెంట్ వైర్లు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో రైతులు


ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభం


హైటెన్షన్ విద్యుత్ స్తంభం కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వైనం మండలంలోని పాంనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతులు, ప్రజలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో పల్లెపాటి సోమిరెడ్డి, షేక్ కమల్ తదితరుల వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు అవగాహన రాహిత్యంతో హైటెన్షన్ విద్యుత్‌స్తంభం కింద ఏర్పాటు చేశారు. వాస్తవానికి హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి 60 అడుగుల దూరం వరకు ఎలాంటి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయవద్దు. అయితే నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలోని 220 కేవీ టవర్ లైన్ కింద ఎస్‌ఎస్ 41/25 కేవీఏ డీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. హై ఓల్టేజ్ పవర్ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు పలుమార్లు కాలిపోయాయని బాధిత రైతులు వాపోతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో హైటెన్షన్ విద్యుత్ స్తంభం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లేందుకు రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. పశువులకు, మనుషులకు విద్యుత్‌షాక్ కొట్టే ప్రమాదం ఉందని, ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 220 కేవీ లైన్ క్రింది నుంచి మార్చాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు..

గ్రామంలో వ్యవసాయ బావుల వద్ద పలు విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంబం రైతుల వ్యవసాయభూముల మధ్య ఉండటంతో పాటు ఒరిగి ఉండటంతో వైర్లు కిందికి వేలాడుతున్నాయి. వంగిన విద్యుత్ పోల్‌లను సరిచేసి వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టింపులేదా..

మండలంలోని జిట్టెగూడెం తండా శివారు నారాయణలొద్దితండాలో రైతు గంగు వ్యవసాయ పొలం వద్ద వేలాడుతున్న విద్యుత్ వైరు తలకు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై ఈనెల 20వ తేదీన గాయపడ్డాడు. అదేవిధంగా పాంనూర్‌లో విద్యుత్ పోల్‌లు, వైర్ల మరమ్మతు పనులు చేస్తుండగా గత నెల 25న కార్మికుడు బానోత్ సోమన్న విద్యుదాఘాతంతో మృతిచెందాడు. రెండు సంఘటనల్లోనూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కనిపించింది. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చింతించే కన్నా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



పాంనూర్ గ్రామంలోని మా వ్యవసాయ భూమి వద్ద హైటెన్షన్ విద్యుత్ స్తంభం కిందే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పొలం వద్ద విద్యుత్‌పోల్ వంగి విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. సమస్యల్ని పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

– పల్లెపాటి సోమిరెడ్డి, రైతు

ఇన్నోవేషన్ ఆవిష్కరణలను ప్రోత్సహించాలి


కొడకండ్ల: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి తదితరులు

కొడకండ్ల: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఎంపీడీఓ నాగేశేషాద్రిసూరి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేషన్ జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణితో కల్సి ఎంపీడీఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆలోచన, ఆవిష్కరణలకు ఇన్నోవేషన్ ఎంతో దోహదపడుతుందని, గ్రామాల్లో దీనిపై అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం చేపట్టాలి

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంత ప్రజల మేధాసంపదను వెలికి తీసేలా ఇంటింటా ఇన్నోవేషన్‌పై విస్తృత ప్రచారం చేపట్టాలని ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేషన్ ప్రొగ్రామ్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ కళ్యాణి అధ్యక్షతన గ్రామ పంచాయతీల కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి



స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు లింగనబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ మండల కమిటీ ఆధ్వర్యంలో ముదిరాజ్‌లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు అందించారు. ఘన్‌పూర్ మత్స్యసొసైటీ అధ్యక్షుడు మునిగెల వెంకటేశ్వర్లు, జిల్లా డైరెక్టర్ బూర్ల శంకర్, మండల ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, నాగరాజు, సారయ్య, అనిల్ పాల్గొన్నారు.

జీపీ నిధుల అక్రమాలపై విచారణ


డీఎల్‌పీఓకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ శివకుమార్

రఘునాథపల్లి: రఘునాథపల్లి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని ప్రజాదర్బార్‌లో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణలు కొనసాగుతునే ఉన్నాయి. ఈ నెల 24న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పంచాయతీ అధికారులతో గ్రామపంచాయతీకి చేరుకొని ఫిర్యాదులపై వివరాలు సేకరించారు. ప్రజాదర్బార్‌లోని ఫిర్యాదులపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఎల్‌పీఓ పార్థసారథిని ఆదేశించిన విషయం విధితమే. ఈ మేరకు డీఎల్‌పీఓ శనివారం గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. కాగా, ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసిన వారు విచారణకు హాజరు కాలేదు. గత పాలకవర్గానికి సంబంధించిన ఐదేళ్ల రికార్డులను రెండు రోజుల్లో పూర్తిగా తనకు అప్పగించాలని జీపీ కార్యదర్శి కవితను ఆదేశించారు.

నిరాధారమైన ఫిర్యాదులు..

నిధులు దుర్వినియోగం అయ్యాయని తనపై చేసిన ఫిర్యాదులు నిరాధారమైనవని మాజీ సర్పంచ్ పోకల శివకుమార్ విచారణ చేపట్టిన డీఎల్‌పీఓకు వినతి పత్రం అందజేశారు. గతంలోనే లోకాయుక్త, పంచాయతీ కమీషనర్, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయగా .. ఉన్నతాధికారులు విచారణ జరిపి ఎలాంటి అక్రమాలు, నిధుల దుర్వినియోగం జరుగలేదని తేలిందన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వినతిపత్రంలో ఆయన కోరారు. ప్రత్యేకాధికారి రాజేందర్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

అక్రమ కేసులు సరికాదు

దేవరుప్పుల/జఫర్‌గఢ్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 7.3 శాతం మాత్రమే నిధులు కేటాయించారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనచేసిన సంఘం ప్రతినిధులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ, సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ విమర్శించారు. దేవరుప్పుల, జఫర్‌గఢ్‌లలో వారు వేర్వేరుగా మాట్లాడారు. ప్రజాసామ్యయుతంగా విద్యార్థులకు బడ్జెట్ కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని నిరసన తెలుపుతుంటే పోలీసులు కేసులు నమోదు చేసి విద్యార్థి సంఘ నాయకులను భయభ్రాంతులకు గురి చేయడం విచారకరమన్నారు. విద్యార్థి హక్కుల కోసం పోరాటం చేస్తే కాంగ్రెస్ ప్రజా పాలనలో కేసులు నమోదు చేయడం అణిచివేతకు అద్దం పడుతుందన్నారు. బేషరతుగా పెట్టిన కేసులు ఎత్తివేయకుంటే విద్యార్థి సంఘాల ఐక్యసంఘటనతో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

'బడ్జెట్‌లో జనగామపై వివక్ష'


మాట్లాడుతున్న బేజాడి బీరప్ప

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జనగామ నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువత కోసం ఇండస్ట్రియల్ కారిడార్ వస్తుందని ఆశిస్తే సమావేశాల్లో దాని ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత అభివృద్ధిని పాలకులు, నాయకులు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పెండెం నాగేష్, నాయకులు సందెల రాము, సద్ది సోమిరెడ్డి, జూకంటి గణేష్, సురేష్, రాంబాబు, నరేష్, సాయితేజ పాల్గొన్నారు.

ప్రజలు, ప్రభుత్వానికి వారధిలా పనిచేయాలి


కొడకండ్ల: మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజలు, ప్రభుత్వానికి వారధిలా సోషల్ మీడియా విభాగం పనిచేయాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. శనివారం కొడకండ్ల, దేవరుప్పుల మండలకేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఆమె చెప్పారు. కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు సత్యనారాయణ, ధరావత్ సురేష్‌నాయక్, నల్ల శ్రీరాములు, సురేష్ బాబు, పాండు కృష్ణ, రసూల్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు

రఘునాథపల్లి: వర్షాలు కురుస్తున్నందున తడిచిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని రఘునాథపల్లి విద్యుత్ ఏడీఈ మనోహర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిసావాల మధ్య, పొలాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను, తెగిపడిన తీగలు, సర్వీస్ వైర్లను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను కూడా తాకవద్దన్నారు. తడి చేతులతో స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దని, ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదని పేర్కొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతు

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి, కూనూర్ గ్రామాల మధ్య కల్వర్టు వర్షాలకు దెబ్బతిని రాకపోకలు నిలిచియాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం కల్వర్టు వద్ద మరమ్మతులు పనులు చేపట్టారు. ప్రస్తుతం రాకపోకలకు అంతరాయం లేకుండా పునరుద్ధరించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తామని బడ్జెట్‌లో అరకొర నిధులతో సరిపెట్టడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సీఎం దిష్టిబొమ్మను మండల కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు కమ్మగాని శ్రీకాంత్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. నిరంజన్, సోమేశ్వర్, దేవరాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నర్మెట: మండల కేంద్రంలో మృతి చెందిన ప్రజ్ఞాపురం కనుకయ్య కుటుంబానికి బాలాజీ పరపతి సంఘం తరుపున రూ. 20వేలను శనివారం అందజేశారు. మృతుడు పరపతి సంఘం సభ్యుడు కావడంతో ఆర్థిక సహాయాన్ని అందించామని సంఘ సభ్యులు తెలిపారు. నారాయణరెడ్డి, పాతూరి ఆంజనేయులు, రమేష్, సేనారెడ్డి, రవి ఉన్నారు.

అక్రమంగా చెట్టు నరికివేత

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట శివారు గ్రామమైన కాశీనగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం చెట్టును నరికి వేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి తన ఇష్టానుసారం అధికారుల అనుమతులు తీసుకోకుండా చెట్టును నరడంతో పలువురు ఇదేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చెట్టు నరికిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


లింగాలఘణపురం: కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ తదితరులు


మొక్క నాటుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్

లింగాలఘణపురం: మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఏనెబావి గ్రామంలోని టెక్స్‌టైల్ పార్క్‌లో వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమౌతుందని, మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగిలప్ప, జిల్లా ఉద్యానవన అధికారి కేఆర్.లత, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ మల్లికార్జున్, ఇండస్ట్రియల్ డీఈ స్మరత్‌చంద్ర, ఏఈ అలోజీ, కార్యదర్శి కరుణాకర్, కారోబార్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతగా చెట్లను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్య నివారణకు చెట్లను పెంచడమే సరైన మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఐదు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. డాక్టర్లు సంధ్యారాణి, జనార్దన్, ప్రదీప్‌కుమార్, సీహెచ్ఓ సాంబయ్య, డాక్టర్ అజయ్, కె.హరిప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలు ఉధృతం చేయాలి


మాట్లాడుతున్న ఆది సాయన్న

చిల్పూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాటాలు ఉధృతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పిలుపునిచ్చారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో శనివారం సీపీఐ మండల మహాసభను మండల కార్యదర్శి పైస రాములు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయన్న మాట్లాడుతూ పేదల పక్షాన చేస్తున్న పోరాటాలతో ఎందరికో న్యాయం జరిగిందన్నారు. ఎక్కడ పేదలు సమస్యలు ఎదుర్కొంటే అక్కడ సీపీఐ వారి తరపున పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్, మహిళా సంఘం జిల్లా నాయకురాలు సుగుణమ్మ పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కుమారస్వామి

సీపీఐ మండల కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన భువనగిరి కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లింగంపల్లిలో శనివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి గుంటిపల్లి వాజ్‌పాయ్ సభ్యులుగా వంగ చంద్రమౌళి, రచ్చ వెంకటయ్య, కొత్తపల్లి వికాస్, సారంపల్లి రాధ, పిట్టల కుమారస్వామి, ఆవుల గణేష్, కార్యవర్ధి రాజు, సొక్కం సునంద, కట్ట ఎల్లయ్య ఎన్నికయ్యారు.

ప్రకృతి ఉత్సవాల్లో మహిళల ప్రాధాన్యం


జఫర్‌గఢ్ బోనాల వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


దేవరుప్పుల: మాదాపురం పాఠశాలలో..

దేవరుప్పుల: మానవ జీవన మనుగడ కోసం కొలిచే ప్రకృతి ఉత్సవాల్లోనే మహిళల ప్రాధాన్యత వెల్లడవుతుందని ప్రధానోపాధ్యాయురాలు నల్ల లలిత అన్నారు. శనివారం మండలంలోని మాధాపురం ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న లష్కర్ బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని బోనాల పండుగ విశిష్టతను తెలిపేలా బాలికలచే ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోలి తిరుపతిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పి శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు ఎం విజయ, వి రజిత తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఘనంగా బోనాలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఎన్ఎస్ఎస్, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణతో నృత్యాల నడుమ బోనాలతో ఊరేగింపు చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ పీఓలు జానీనాయక్, మహేందర్, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, కందగట్ల గణేష్, వెంకటేశ్వర్లు, పీఈటీలు రాజు, శ్రీనాథ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


మృతుడి పర్సులో లభించిన ఫొటో

జనగామ: జిల్లా కేంద్రం అంబేడ్కర్‌నగర్ కాలనీ సమీపంలో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. జీఆర్‌పీ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వెళ్లే గుర్తు తెలియని రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి వయస్సు (25) ఏళ్లు ఉంటుందని, యాష్ కలర్ జీన్స్, బ్లాక్ అండ్ వైట్ కాఫీ కలర్ మిక్స్‌తో ఉన్న షర్టు, క్రోక్స్ చెప్పులు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి పాయింట్ జేబులో ఫొటోతో పాటు రూ.5 కాయిన్, స్మార్టు ఫోన్ తప్ప ఇతర వివరాలు లేవన్నారు. ఫోన్ సైతం నుజ్జు నుజ్జు కావడంతో వివరాలు సేకరించడంలో జాప్యం జరుగుతుందని చెప్పారు. పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94400 27342, 90101 00958 నంబర్లను సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మహాసభను విజయవంతం చేయాలి

పాలకుర్తి: ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 9వ తేదీన సరూర్‌నగర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్‌భవన్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సేన జిల్లా అధ్యక్షుడు కనుసోత్ అనిల్‌చౌహాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభ కరపత్రాలను శనివారం పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో ఆయన ఆవిష్కరించారు. ప్రవీణ్, భిక్షపతి, రఘునాయక్, రఘునాయక్, హుస్సేన్, శ్రీకాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

లింగాలఘణపురం: పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతులు రైతు బీమా కోసం ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 నుంచి పాసు పుస్తకం కలిగిన రైతులు ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేసుకోని వారితో పాటుగా కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు కూడా నమోదు చేసుకోవాలని కోరారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: ఈనెల 28 జనగామ కామాక్షి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సీపీఎం నేత, జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసీ రెడ్డి నరసింహారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడారు.

అర్చక, ఉద్యోగులకు భద్రత కల్పించాలి

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలోని దేవాలయాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అర్చక, ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్, పాలకుర్తి దేవస్థానం అర్చకుడు డీవీఆర్.శర్మ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సచివాలయంలో అర్చక ఉద్యోగుల సమస్యలపై వినతి ప్రతం అందజేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పాలకుర్తి టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మీనారాయణపుం గ్రామానికి చెందని గూడ జయలక్ష్మి(37) హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతు శనివారం మృతి చెందింది. ఎస్సై మెడం సాయి ప్రసన్న కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10వ తేదీన వ్యవసాయ కూలి పనులు ముగించుకుని వస్తున్న జయలక్ష్మి లక్ష్మీపురం–విస్నూరు గ్రామాల మధ్య ఆటో–బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించాగా చికిత్స పొందుతు మృతి చెందింది. భర్త రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దేవరుప్పుల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శ్రీలక్ష్మీ సూచించారు. మండలంలోని సింగరాజుపల్లిలో మండల వైద్యాధికారి రవితేజ పర్యవేక్షణలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి రక్తనమూనాలు సేకరించి అవసరార్థులకు మందులు పంపిణీ చేశారు.

నేర ప్రవృత్తిని నిలువరిద్దాం

దేవరుప్పుల: యువత సోమరితనం వైపు పయనించకుండా నేర ప్రవృత్తిని నిలువరిద్దామని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై సుజన్‌కుమార్‌ను కడవెండి కాంగ్రెస్ నాయకులు, గొల్ల కురుమల సంఘం మండల ప్రతినిధులు వేర్వేరుగా కలిసి సన్మానించారు.

నోట్ బుక్స్ పంపిణీ

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ ప్రభుత్వ పాఠశాలలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ సాయిరెడ్డి మెమోరియల్ వారు విద్యార్థులకు శనివారం నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు.